క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాల పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ శరత్ సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలను చేయించుకోవాలని ఆయన సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డి: గాంధారి మండలంలోని గుర్జాల్‌తండాకు చెందిన నేనావత్ రతన్‌కు ఎస్సై గణేష్ సోమవారం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందించారు. గత నెలలో రతన్ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసి బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆర్థిక సాయం



భిక్కనూరు: బస్వాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన గాల గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గ్రామానికి వచ్చి గాల గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి.. ఆయన భార్య లక్ష్మికి రూ.25 వేలను అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు మల్లారెడ్డి, మద్ది స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రి గోపాల్ ఉన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ తాత లక్ష్మా గౌడ్ రెండు రోజుల క్రితం మృతి చెందగా.. సర్పంచి రవితేజ గౌడ్ కుటుంబాన్ని సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పరామర్శించారు.

తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని కాళోజీ

బాన్సువాడ రూరల్: తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని, ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ అన్నారు. సోమవారం కళాశాలలో కాళోజీ 21వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజకీయ, సాంఘిక అంశాలపై ఆయన ఎన్నో కవిత్వాలు రాశారని గుర్తుచేశారు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషాదినోత్సవంగా జరుపుకుంటోందన్నారు. కాళోజీ స్మారకార్థం హన్మకొండలో కళాక్షేత్రం నిర్మిస్తున్నారని తెలిపారు. అధ్యాపకులు వెంకట్రావ్, ఉమారాణి, బాలరాజు, రాజేష్, శేఖర్, గోపాల్, చిరంజీవి, అంబయ్య, వినయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి నామినేషన్ల తిరస్కరణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వారిలో ఇద్దరి నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ సోమవారం తెలిపారు. నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావడంతో నామినేషన్లకు సోమవారం స్క్రూటినీ నిర్వహించారు. వీరిలో 16 మంది నామినేషన్లు వేయగా వారిలో యుగతులసి పార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి జాట్రోత్ సురేంద్రకు సంబంధించిన నామినేషన్లు స్క్రూటినీలో తిరస్కరించారు.

ప్రగతికి తొలిమెట్టు 'ప్రశ్న'



బాన్సువాడ రూరల్: ప్రగతికి తొలిమెట్టు 'ప్రశ్న' అని, ప్రతి ఒక్కరు తమను తాము ప్రశ్నించుకుని శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని కామారెడ్డి జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు పి.విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం బోర్లంక్యాంపులోని తన నివాసంలో ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అనే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రతి ఏటా బాల విజ్ఞానమేళ, సైన్సు జాతర, సైన్సు ప్రదర్శన, కళాజాత, పుస్తక ప్రదర్శన లాంటి ఎన్నెన్నో కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక పోరాడుతుందన్నారు. విద్య, వైద్యం ప్రజలందరికి అందాలని ప్రభుత్వాలను కోరుతున్నామని, అందుకే ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అనే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. ఆయన వెంట పట్లోళ్ల లక్ష్మి, సంజీవరెడ్డి, సంగం రమ్యా శ్రీనివాస్‌రెడ్డి, గాయకుడు నూతన్ తదితరులు ఉన్నారు.

పైసా తీసుకోకుండా పనిచేస్తా

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు
- వాడి సర్పంచ్‌తో సహా పలువురు కాంగ్రెస్‌లో చేరిక



నాగిరెడ్డిపేటలో తిలకం దిద్దుతున్న మహిళ



వాడి సర్పంచ్ అనూషను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట: తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టే పనులలో పైసా కమీషన్ తీసుకోకుండా పనిచేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని వదల్‌పర్తి, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, లింగంపల్లి తదితర గ్రామాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడి సర్పంచ్ అనూష, ఉపసర్పంచ్ కుమార్‌తోపాటు పలువురు వార్డు సభ్యులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ గత ఎన్నికలలో నియోజకవర్గ ప్రజలు చందాలు పోగేసి సురేందర్‌ను గెలిపిస్తే ఆయన బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారన్నారు. దీంతోపాటు అభివృద్ధి పనులలో కమీషన్లు తీసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాడన్నారు. కరోనా సమయంలో తాను చేసిన సేవలను గుర్తించి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్, మాజీ ఎంపీపీ చెన్న లక్ష్మణ్, నాయకులు బొల్లు నర్సింహారెడ్డి, ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు షాహెద్‌పాషా, నాయకులు రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఇమామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మేనిఫెస్టోతో ముందుకు..

తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలోని ప్రతి మండలంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేస్తానని మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే 48గంటలలో స్పందించి మూడు వారాల్లోగా పరిష్కరిస్తానన్నారు. సోమవారం ఆయన నాగిరెడ్డిపేటలో విలేకరులతో మాట్లాడారు. తాను గెలిచిన తర్వాత చేపట్టే పనులకు సంబంధించి ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించానన్నారు. వ్యవసాయానికి ఊతమిచ్చేందుకు అగ్రి ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. ఎల్లారెడ్డి మీదుగా బోధన్ –బీదర్ రైల్వేలైన్‌ను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తానన్నారు. రోడ్లను అభివృద్ధిచేస్తానని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి పేదపిల్లలను నాణ్యమైన విద్య అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, షాహెద్‌పాష, లక్ష్మణ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మదన్‌మోహన్ రావు సమక్షంలో పార్టీలో చేరిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అడివిలింగాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, తదితరులున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఆరో వార్డులో మురికికాలువలో బకెట్ ఉంచి తాగు నీటిని పట్టుకుంటున్న స్థానికులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ 6వ వార్డులో తాగునీటికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఉదయం మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని పట్టుకోవాలంటే ఇంటి ముందు ఉన్న మురికి కాలువలో బిందెలు పెట్టి తాగునీటిని పట్టుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రక్షిత మంచినీటి ట్యాంక్ నుంచి నీటిని వదిలే వాటర్‌మ్యాన్ తన ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్లనే తాగునీరు సక్రమంగా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోజు రెండు, మూడు బిందెలు కూడా భగీరథ నీరు రావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తమ కాలనీకి భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

హరిత లక్ష్యం.. నెరవేర్చే యత్నం



నాగిరెడ్డిపేట మండలం పోచారం నర్సరీలో బ్యాగుల్లో మట్టిని నింపుతున్న కూలీలు

- గ్రామాల్లోని నర్సరీలకు మట్టి తరలింపు
- మొక్కల పెంపకానికి అధికారుల సన్నద్ధం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ఆవిర్భావం తర్వాత హరితహారం పథకానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేకంగా నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. నర్సరీలలో వివిధ రకాల మొక్కలను పెంచి వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ యేడు కూడా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సంయుక్తంగా పనిచేసి నర్సరీ ఏర్పాటు పనులు చేపట్టారు. నర్సరీల నిర్వహణలో గతయేడు చోటుచేసుకున్న వైఫల్యాలు ఈ యేడు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ప్రతి జీపీకి 10 వేల మొక్కల లక్ష్యం..

ప్రతి జీపీ పరిధిలోని నర్సరీలో 10 వేల మొక్కలను పెంచాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. గతయేడు నర్సరీలలో మిగిలిన మొక్కలను జాగ్రత్తగా కాపాడుతూ నూతన మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టారు. వచ్చేయేడు జూన్ నాటికి నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉండేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికల రూపొందించుకున్నారు. ఈ మేరకు జిల్లాలోని దాదాపు అన్ని జీపీలకు ఎర్రమట్టి తరలింపు పనులు చేపట్టారు. ఎర్రమట్టిని జల్లెడ పట్టించి అందులో కంపోస్ట్‌షెడ్లలో తయారుచేసిన ఎరువును కలపనున్నారు. అనంతరం బ్యాగు ఫిల్లింగ్ పనులు, అవసరమైన విత్తనాలను తెప్పించి సీడ్ డిబ్లింగ్ చేయనున్నారు. జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు.

మట్టి తరలింపు పూర్తి

నాగిరెడ్డిపేట మండలంలోని అన్ని జీపీల పరిధుల్లో నర్సరీల ఏర్పాటు కోసం ఎర్రమట్టి తరలింపు పనులు పూర్తయ్యాయి. ఎర్రమట్టిని ట్రాక్టర్‌తో తొక్కించి జల్లెడ పట్టిస్తాం. అనంతరం బ్యాగు ఫిల్లింగ్, సీడ్ డిబ్లింగ్ పనులను చేపట్టి సకాలంలో నర్సరీలలో మొక్కలు సిద్ధమయ్యేలా చర్యలు చేపడుతున్నాం. – సాయిలు, ఈజీఎస్ ఈసీ, నాగిరెడ్డిపేట

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పిట్లంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో చిల్లర్గి, పిట్లం, తిమ్మనగర్ గ్రామాలకు చెందిన 30 మంది ఇతర పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు ఎమ్మెల్యే ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిల్లర్గి మాజీ ఎంపీటీసీ హన్మగౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జైపాల్ గౌడ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, నాయకులు విజయ్, అన్నారం వెంకట్‌రాంరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ డిక్లరేషన్‌ను నమ్మొద్దు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు కలీం పటేల్‌తో పాటు మరి కొంత మంది కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారని, ప్రత్యేకంగా మైనార్టీ గురుకుల పాఠశాలలు, షాదీముబారక్, రూ.లక్ష ఆర్థిక సహాయం, కమ్యూనిటీ భవనాల కోసం రూ. కోట్ల నిధులు ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్‌ను నమ్మవద్దని, మోసపూరిత డిక్లరేషన్‌తో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడిగేందుకు వస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీల అభివృద్ధికి చేసింది శూన్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు దొరక్క ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. స్థానికులకు పట్టం కట్టాలని సూచించారు. ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగనాథ్‌పటేల్, అసద్ అలీ, జావేద్, కలీంపటేల్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



బాన్సువాడ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేస్తామని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని మాలమహానాడు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు బాన్సువాడలో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వర్గీకరణ తెలంగాణలో చేస్తామని ప్రకటించడాన్ని తప్పుపట్టారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చెల్లదని కొట్టేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల, మాదిగలను విడదీయడానికి పన్నిన కుట్రగా వారు అభివర్ణించారు. నాయకులు మల్లూరి సాయిలు, బంగారు మైశయ్య, మన్నెచిన్నసాయిలు, క్రిష్ణ, దొన్కంటి బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య కోర్సుల్లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తీర్ణులైన విద్యార్థులతో వంశీప్రతాప్ గౌడ్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు ఇద్దరు ఈ యేడాది నిర్వహించిన కూచిపూడి నృత్య కోర్సు పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు నృత్యగురువు, జాతీయ కళాకారుడు డాక్టర్ ఎస్.వంశీప్రతాప్‌గౌడ్ తెలిపారు. సోమవారం కూచిపూడి నృత్య కళాకారులు ఎస్.హర్షిత, ఎం.రితికలను అభినందించారు. నాట్య గురువులు కనకతార, ఉమ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

52వ సారి రక్తదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్ 52 సారి రక్తదానం చేశారు. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన అశోక్‌గౌడ్ అనే వ్యక్తి డెంగీతో బాధపడుతుండగా సోమవారం కిరణ్ కుమార్ ఓ–నెగిటివ్ రక్త దానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో కిరణ్ కుమార్‌కు రక్తదానం చేయడం పట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయ కర్త బాలు అభినందించారు.

హ్రియానంద విద్యాభారతి జయంతి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి శ్రీచండీ మంత్రాలయంలో ఆదివారం హ్రియానంద విద్యా భారతి స్వామి జయంతి వేడుకలు, దీపావళి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పారాయణం, భజన సత్సంగం, అమ్మవారి ప్రవచనాలు, హారతి, శాంతి మంత్రం తదితర కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో హ్రియానంద స్వామి భక్తుల పరివారం పాల్గొంది.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉప్పల్‌వాయి విద్యార్థి



రామారెడ్డి: గత నెల అక్టోబర్ 31న గండిమాసాన్‌పేట్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉప్పల్‌వాయి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రావు తెలిపారు. పాఠశాలకు చెందిన నిఖిల్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి నవంబర్ 15 ,16, 17 తేదీలలో తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ పేర్కొన్నారు. వీరిని నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతీకుల్లా, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉర్సును విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: మండలంలోని బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో కొత్తాబాది గ్రామ సమీపంలో వెలసిన హజ్రత్ సూఫీ సయ్యద్ షా మొహ్మద్ ఐనోద్దీన్ దర్గా ఉర్సు ఈనెల16 నుంచి ప్రారంభం కానున్నాయి. దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహ్మద్ యూసూఫ్ ఉద్దీన్ మాట్లాడుతూ.. ఈనెల 16న గంధం(సందల్) ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థన అనంతరం కవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. 17న దర్గాలో దీపారాధన, ఖురాన్ బోధనలు, కవ్వాలి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 18న ఉర్సు ముగుస్తాయన్నారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమాచారం..

నేటి నుంచి కార్తీక మాస నిత్యార్చనలు

కామారెడ్డి అర్బన్: కార్తీక మాసం సందర్భంగా విద్యానగర్ శ్రీ విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి నెల రోజుల పాటు నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. నిత్యార్చనలు, అభిషేక ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. 17న నాగుల చవితి, 26న కార్తీక పున్నమి, నవంబర్ 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో కార్తీక సోమవారాలు ప్రత్యేక కార్యక్రమాలుంటాయని వివరించారు.

డిసెంబర్ 3న తట్టాబుట్టా సర్దాల్సిందే

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ ఎద్దేవా
- నియోజకవర్గంలో జోరుగా ఎన్నికల ప్రచారం



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల



ప్రశాంత్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: డిసెంబర్ 3న ప్రతిపక్ష పార్టీలు తట్టాబుట్టా సర్దుకుని పోవాల్సిందేనని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసి సాధించారని అన్నారు. కేసీఆర్ సాధించిన తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు అనుసరిస్తున్నాయన్నారు. ఎల్లారెడ్డిలో 60 ఏళ్లలో జరగని అభివృద్ధి తన హయాంలో ఐదేళ్లలో జరిగిందన్నారు. నియోజకవర్గంలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు జరగగా, ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపాలిటీ నిధులతో రూ.50 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. వంద పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, నూతన బస్టాండ్ నిర్మాణ పనులు తన హయాంలోనే ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నారాయణ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణా గౌడ్ తిరుపతి, ఇమ్రాన్ తదితరులున్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయండి

ఈనెల 15న ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డికి వస్తున్నారని ఎమ్మెల్యే సురేందర్ తెలిపారు. సీఎం సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

తండాలను జీపీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

లింగంపేట(ఎల్లారెడ్డి): తండాలను జీపీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండలం నల్లమడుగు చిన్న తండాలో ఇంటింటికి ప్రచారంలో భాగంగా గిరిజనులతో మాట్లాడారు. తండాలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని భరోసా ఇచ్చారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీకి చెందిన సాగర్ రెడ్డి, నాగరాజు, శ్రీధర్‌లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్, బీజేపీ నాయకులు ప్రశాంత్‌గౌడ్ ఆదివారం రాత్రి జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మైనార్టీ యువకులు, మీసానిపల్లికి చెందిన పలువురు నాయకులు కూడ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తదితరులున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రం నుంచి చందాపూర్‌కు వెళ్లే రోడ్డులో గుంత ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాడ్వాయి నుంచి ఈ రోడ్డుపై చందాపూర్, సంగోజీవాడి, కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు తరచుగా వస్తూ పోతుంటారు. ఈ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత కారణంగా పలుమార్లు కిందపడ్డామని ప్రయాణికులు చెబుతున్నారు. రాత్రివేళలో ఈ గుంత సరిగ్గా కనిపించడం లేదని, భారీ ప్రమాదాలు జరగక ముందే ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుని గుంతను పూడ్చి వేయాలని కోరుతున్నారు.



తాడ్వాయి-చందాపూర్ రోడ్డులో ఏర్పడిన గుంత